


# ప్రజా ఆశీర్వాద సభతో జోష్

- స్పీడ్‌గా దూసుకుపోతున్న కారు
- వేలాదిగా తరలివచ్చిన జనం
- సభ సక్సెస్ కావడంతో రెట్టింపు ఉత్సాహంలో బీఆర్ఎస్ శ్రేణులు

కోటపల్లి, నవంబర్ 8 : చెన్నూర్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభ బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. మందమర్రిలో మంగళవారం నిర్వహించిన చెన్నూర్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు అనుకున్నదాని కన్నా రెట్టింపు సంఖ్యలో ప్రజలు తరలిరాగా కారు స్పీడ్ మరింత పెరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్ కావడంతో చెన్నూర్ నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా బీఆర్ఎస్ నిలిచింది. తెలంగాణ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసగం అన్ని వర్గాలను ఆకట్టుకునేలా సాగగా గులాబీ దళంలో రెట్టింపు జోష్ కనిపించింది. చెన్నూర్, కోటపల్లి, జైపూర్, భీమారం, మందమర్రి మండలాల నుంచి వేలాది సంఖ్యలో ప్రజలు ఆశీర్వాద సభకు తరలివచ్చి హ్యాట్రిక్ సీఎం కేసీఆర్, చెన్నూర్‌కు రెండోసారి ఎమ్మెల్యే బాల్క సుమన్ అంటూ నినాదాలు చేయడం ఆకట్టుకుంది. చెన్నూర్ ప్రజా ఆశీర్వాద సభలో 40వేల కుర్చీలు వేయగా, అన్నీ నిండిపోగా సుమారుగా 10 వేల నుంచి 20 వేల మంది జనాలు సభ బయటే ఉన్నారు. రైతులు, మహిళలు, వృద్ధులు, సింగరేణి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

### ఆకట్టుకున్న కేసీఆర్ ప్రసంగం

ప్రజా ఆశీర్వాద సభలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి బాల్క సుమన్ చేసిన కృషిని వివరించడంతో పాటు కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే కలిగే నష్టాలను వివరించారు. ఎన్నికల సమయంలో సూట్‌కేసులు పట్టుకొని వచ్చే నాయకులు కావాల్నా... ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కొట్లాడే బాల్క సుమన్ కావాల్నా అని కేసీఆర్ అన్న మాట ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. ఆపద, సంపతి వచ్చినప్పుడు మనముందే ఉండే నాయకుడు కావాలని, చిల్లరమల్లరకు ఆశ పడితే ఆగమయితామని కేసీఆర్ గుర్తు చేశారు. దళితులకు తరతరాలుగా జరుగుతున్న అన్యాయాన్ని వివరించడంతో పాటు కాంగ్రెస్, బీజేపీలు సింగరేణి నిర్వీర్యానికి చేస్తున్న కుట్రలను వివరించారు. ఓటు వజ్రాయుధమని, దానిని సక్కగా వాడుకొని మంచి నాయకుడిని ఎన్నుకోవాలని కేసీఆర్ కోరారు. చెన్నూర్ నియోజకవర్గంలో సుమన్ రాక ముందు.. వచ్చిన తర్వాత.. అనే విషయాన్ని చూసి ఓటు వేయాలన్నారు. బాల్క సుమన్ తనకు ఎంత దగ్గరనో చెప్తూనే, మళ్లీ గెలిపిస్తే ఎలాంటి అభివృద్ధి జరుగుతుందో వివరించారు.

### గులాబీ సైన్యంలో ఫుల్ జోష్

చెన్నూర్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభ సూపర్ హిట్ కావడం గులాబీ శ్రేణుల్లో సరికొత్త జోష్ నింపింది. ఎనలేని ఉత్సాహంతో నియోజకవర్గం నలుమూలల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు, మహిళలు తరలిరావడం చూసి చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ మరోమారు భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని చర్చించుకోవడం కనిపించింది. చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వ విప్ బాల్క సుమన్ చేసిన అభివృద్ధి, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారు పెద్ద సంఖ్యలో ఈ సభకు తరలివచ్చారు.


సీఎం కేసీఆర్ ప్రసంగిస్తుండగా యువకుల కేరింతలు

**'బాల్క సుమన్ తెలంగాణ ఉద్యమంలో ఉన్న వ్యక్తి కాబట్టి, నేనున్న నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృది చేసుకోవాలనే తండ్లాడుతాండు. సుమన్ రెండు పనులు చేస్తుండు. ఇక్కడ మీ సేవలు చేస్తడు చెన్నూర్‌లో. అక్కడ పార్టీ కోసం మా ఇంట్లనే ఉంటడు. నా బిడ్డలాంటోడని పోయిన సారె చెప్పిన. హైదరబాద్‌లో ఉంటే సగం టైం నా ఇంట్లోనే ఉంటడు. అలాంటి వ్యక్తి గెలిస్తే మీకు లాభం కలుగతది. ముఖ్యమంత్రి చెయ్యికిందనే ఉంటడు కాబట్టి ఏ పని చెప్పిన ఆగకుండా నడుస్తది. మంచి బెనిఫిట్ అయ్యే ఆస్కారం ఉంది. పార్టీలు మార్చి సూట్‌కేస్‌లు పట్టుకొని వచ్చేటోళ్లు గెలిస్తే అభివృద్ధి జరగదు... ప్రజల కోసం పనిచేసెటోన్ని గెలిపించుకుంటే అభివృద్ది జరుగుతుంది'**

**-చెన్నూర్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్**

### కేసీఆర్ పాలన అద్భుతం



ఉమ్మడి రాష్ట్రంలో అప్పుడునోళ్లు తెలంగాణాకు అన్యాయం చేసింద్రు. రాష్ట్రాన్ని సాధించిన సీఎం కేసీఆర్ పదేండ్ల పాలన అద్భుతం. పక్క రాష్ట్రాలు కూడా మనకెళ్లే చూసేటట్టు అభివృద్ధి చేసిండు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను పెట్టి మా ఇండ్లకు వచ్చి షాదీముబారక్, కళ్యాణలక్ష్మి, ఆసరా, దళితబంధు, బీసీ బంధువంటి సంక్షేమ పథ కాల ను ప్రవేశపెట్టిండు. చెన్నూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందు ఉంచు తు న్న బాల్క సుమన్‌కే మా మద్దతు.

**-వ్యాంసని మమత, మందమర్రి**

### అభివృద్ధి ఘనత బాల్క సుమన్‌దే



అరవై ఏండ్లలో జరగని చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధి బాల్క సుమన్ హయాంలో జరిగింది. గ్రామాలకు రోడ్లు, వాగులపై బ్రిడ్జిలు లేక అవస్థలు పడిన ప్రజలు సుమన్ పాలనలో వెలుగు చూసింద్రు. మంత్రులుగా ఉన్నప్పుడు కూడా జరగని అభివృద్ధి ఎమ్మెల్యేగా బాల్క సుమన్ ఎంతగానో చేసిండు. అభివృద్ధే అజెండాగా సాగుతున్న బాల్క సుమనన్నకే మా సంపూర్ణ మద్దతు ఉంటుంది.

**-కొడిశెట్టి రాజు, సూపాక (కోటపల్లి)**

### సింగరేణికి మంచిరోజులు



బీఆర్ఎస్ పాలనలోనే సింగరేణికి మంచిరోజులు వచ్చాయి . గత ప్రభుత్వాలు కూడా ఏవి కూడా సింగరేణిని పట్టించుకోలేదు. బీఆర్ఎస్ పాలనలో బాల్క సుమన్ సారథ్యంలో మాకు మంచి రోజులు వచ్చాయి. కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న బీఆర్ఎస్‌కే మా మద్దతు ఉంటుంది.

**-సీపెల్లి రాజలింగు, సింగరేణి కార్మికుడు**

# కేసీఆరే సీఎం గావాలె..

- గులాబీ జెండా మళ్లా ఎగరాలె..
- ఆయా చోట్ల ప్రజల అభిప్రాయం

### మళ్లీ సీఎం కేసీఆర్ సారే సీఎం



కాసిపేట, నవంబర్ 8 : పింఛన్ పెంచిన ఘనత సీఎం కేసీఆర్ సారుదే. మళ్లీ ఆయనే సీఎం అయితడు. మళ్లో సారి పెంచుతామని హామీ ఇచ్చిన్రు. ఇగ కచ్చితంగా అమలు చేసి తీరుతరు. చాలా ఆనందంగా ఉంది. పెద్ద మనుషులు ఇబ్బందులు పడుతరనే ఇలాంటి ఆలోచన చేసి పింఛన్ పెంచి ఇస్తనని కేసీఆర్ సారు చెబుతున్నరు. ఇగ ఆయన మళ్లా గెలుసుడు పక్కా.బు

**-భూపల్లి కవిత**

### కారుణ్యం తెచ్చిన ఘనత సీఎం కేసీఆరే



కాసిపేట, నవంబర్ 8 : సింగరేణిలో కారుణ్య నియామకాలు చేపట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దే. నేను ఉద్యోగం చేస్తున్నా అంటే అది కారుణ్య నియామకాల వల్లే సాధ్యమైంది. సింగరేణిలో అన్ని వర్గాల కార్మికులకు అన్ని రకాల హక్కులు, సేవలు అందుతు న్నాయి. కార్మికులు అంతా సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎ స్ ప్రభుత్వాకి అండగా ఉంటాం. బెల్లంపల్లి సభకు వచ్చిన కార్మికులమంతా సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్ ప్రభుత్వంకు మద్దతుగా ఉంటామని చెప్పేందుకే భారీగా తరలివచ్చాం.

**-పానగంటి రవి కాంత్ (సింగరేణి కార్మికుడు)**

### మాకు నమ్మకం ఉంది



కాసిపేట, నవంబర్ 8: మహిళల అభ్యున్నతి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యం. మహిళలకు రూ.3వేలు గౌరవ భృతి ఇస్తమని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆయన కచ్చితంగా ఇస్తారు. మాకు నమ్మకం ఉంది. మళ్లీ గెలుస్తాడు. మహిళలకు గౌరవ భృతి అందిస్తాడు. మన రాష్ట్రంలో మహిళలకు ఉన్న పథకాలు ఎక్కడా లేవు. మరిన్ని పథకాలు అందిస్తారని నమ్మకం ఉంది.

**-సాజితా బేగం**

### సీఎం కేసీఆర్ సారే రావాలి



సీఎం కేసీఆర్ సారే రావాలని గ్రామాల్లో ప్రతి ఒక్కరం కోరుకుంటున్నాం. మళ్లీ సారు వస్తాడు. మరిన్ని పథకాలు అమలు చేస్తడు. అన్ని సామాజిక వర్గాల ప్రజల అభివృద్ధి, సమ న్యాయం చేస్తుంది సీఎం కేసీఆర్ సారే. ఎవరి మాటలను మేము నమ్మం. నమ్మకం అంటేనే సీఎం కేసీఆర్. మాట ఇచ్చాడు అంటే చేసి తీరుతడు. అదే నమ్మకంతోనే సీఎం కేసీఆర్ సారే మళ్లీ రావాలని కోరుకుంటున్నాం. బెల్లంపల్లి సభకు సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వానికి మద్దతు తెలిపేందుకు వచ్చాను.

**-సల్లూరి ప్రభాకర్**

### పథకాలు ఆకర్షణీయంగా ఉన్నాయి..



కెరమెరి, నవంబర్ 8: నా పేరు భూషణ్. మాది మహారాష్ట్రలోని రాజురా తాలుక. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సూపర్. రైతులతో పాటు అన్ని వర్గాల సంక్షేమం కోసం వినూత్న పథకాలు అమలు చేస్తున్నారు. దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా అభివృద్ధి చెందుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండడం తెలంగాణ ప్రజల అదృష్టం. మా రాష్ట్రంలో కూడా ఉంటే బాగుండేది.

**-భూషణ్ రాజురా(మహారాష్ట్ర)**

### బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం..



కెరమెరి, నవంబర్ 8: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం. రాష్ట్రం ఏర్పాటు అనంతరం బీఆర్ఎస్ హయాంలోనే మారుమూల గ్రామాలు పల్లెలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయల కల్పన జరిగింది. మళ్లీ ఇదే ప్రభుత్వం రావాలి. అప్పుడే తెలంగాణ పల్లెలు మరింత అభివృద్ధి సాధిస్తాయి.

**-బొట్టుపల్లి గోపాల్, రాజురా**

### ఇది రైతు ప్రభుత్వం..



బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం. ఎందుకంటే బీఆర్ఎస్ పాలన నుంచే రైతుల సంక్షేమం కోసం పెట్టుబడి సహాయం కింద రైతు బంధు పథకం పెట్టిన్రు. దురదృష్టంగా రైతు మరణిస్తే, ఆ కుటుంబం రోడ్డున పడకుండా రైతు బీమాను తెచ్చిండు సీఎం సారు. అప్పటి నుంచే రైతు ఆత్మహత్యలు తగ్గి రైతులకి అప్పులు లేకుండా పంట దిగుబడి పెరిగి అభివృద్ధి సాధిస్తున్నడు. మళ్లా కేసీఆర్ సార్ సీఎం అయితేనే రైతులు ఇంకా అభివృద్ధి సాధిస్తారు.

**-పెందోర్ సీతారాం, శెట్టిహడ్పనూర్(సిర్పూర్ యు)**